క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 126 కేసులు పరిష్కారం

అమలాపురం టౌన్: అమలాపురం కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 126 కేసులు పరిష్కారం అయ్యాయి. అమలాపురం జిల్లా రెండో అదనపు కోర్టులో న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకున్నారు. పరిష్కారమైన 126 కేసుల్లో 56 సివిల్ కేసులు, 23 బ్యాంక్ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసుల 20, బీఎస్ఎన్ఎల్ కేసులు ఉన్నాయి. మొత్తం రూ.17.93 కోట్ల మేర 126 క్రిమినల్ కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి ఏ.సాయి కుమారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు, అదాలత్ సభ్యులైన న్యాయవాదులు, భాస్కరశాస్త్రి, కళా వెంకట్రావు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

యానాం: యానాం సబ్‌కోర్టులో తాలూకా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 31 కేసులు పరిష్కారం అయినట్లు సబ్ జడ్జి, లీగల్ సెల్ కమిటీ చైర్మన్ రాజామోహన్ తెలిపారు. కక్షిదారులకు రూ.27.90 లక్షల మేర సెటిల్‌మెంట్‌లు జరిగినట్లు చెప్పారు. పారాలీగల్ కమిటీకి పెట్టుకున్న అర్జీల్లో పీఎల్‌సీ కేసులకు సంబంధించి రూ.75 వేల మేర సెటిల్‌మెంట్ అయ్యింది. కార్యక్రమంలో ప్యానల్ సభ్యుడు పేర్ని ఆదినారాయణ మూర్తి, ఏపీపీ సలాది శ్రీనివాస్, న్యాయవాదులు కమిడి విజయకుమార్, భాషా, నారాయణ, పడాల సుబ్బారావు, స్వరాజ్యలక్ష్మి, సుధ, మోక్షిత, ఉషారాణి, సూపరింటెండెంట్ జయప్రకాష్, సిబ్బంది మహేశ్వరి, నందికి జయప్రకాష్, గొలుగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం

అమలాపురం టౌన్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామని ప్రిన్సిపాల్ కడియం శిరీష అన్నారు. వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు అనువుగా స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ప్రతి ఏడాది ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని, ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు ఉన్నతంగా రాణిస్తున్నారని చెప్పారు. విద్యార్థినుల కోసం హాస్టల్ అందుబాటులో ఉందని, బస్ సౌకర్యం సైతం ఉందన్నారు. బాలికల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల కళాశాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు పూజలు

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామంలో వేంచేసి యున్న గ్రామదేవత సత్తెమ్మతల్లి 3వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

అమలాపురం రూరల్: సమైక్య భారతి ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు నల్లా పవన్ కుమార్ తెలిపారు. అమలాపురం విష్ణుశ్రీ గ్రాండ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైన శ్రీరాములు మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆదివారం సాయంత్రం నిర్వహించే కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు వాసురావు, గురజాడ అప్పారావు ముని మనవడు ఎం .విజయ్ గోపాల్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు గోదశి గంగరాజు, హిందీ శాఖాధిపతి నల్లా సత్యనారాయణ, గిడుగు రామ్మూర్తి ముని మనవడు గిడుగు నాగేశ్వరరావు వంటి ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని వారు కోరారు.

పెట్రోల్ బంకులు నిబంధనలు పాటించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో పెట్రోలియం ఉత్పత్తుల బంకుల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శనివారం పుదుచ్చేరి లీగల్ మెట్రాలజీ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ సి గణేషన్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఏదైనా తక్కువ పరిమాణంలో పంపిణీ జరిగితే తక్షణం ఆ బంకును నిలిపి వేయాలన్నారు. పుదుచ్చేరి లీగల్ మెట్రాలజీ ఆఫీసర్‌కు తక్షణం సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల యానాంలో ఒక పెట్రోల్ బంకులో తనిఖీ చేయగా ప్రతిరోజు డెలివరీకి ముందు పంపు తనిఖీ చేయనందుకు రూ.5వేలు జరిమానా విధించామన్నారు.

శర్వణన్ పోరాటం ప్రశంసనీయం

యానాం: పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ఎన్నో ఏళ్లుగా తాత్కాలిక ఉద్యోగులుగా చేస్తున్న వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న గవర్నమెంట్ సర్వెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ నేత ఎం ఎస్ శర్వణన్ సేవలు ప్రసంశనీయమని పలువురు పేర్కొన్నారు. శనివారం స్థానిక పాతబస్టాండ్‌లో శర్వణన్ పుట్టినరోజు వేడుకలను పలువురు పీడబ్ల్యూడీ ఎన్ఎంఆర్ ఉద్యోగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల వందలాది మంది ఎన్ఎంఆర్‌లకు కనీస వేతనం అమలు ఆయన పోరాటం తోనే సాధ్యమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో విద్యుత్ స్తంభం తీగలపై పాకిన మొక్కలు



పోలవరంలో క్రోటన్ మొక్కను తలపిస్తున్న విద్యుత్ స్తంభం



పోలవరంలో పొదల మధ్య దాక్కున్న విద్యుత్ స్తంభం



ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లిలో విద్యుత్ స్తంభంపై పాకిన తీగ మొక్కలు

స్తంభమెక్కగలను.. తీగపాకగలను..

- విద్యుత్ స్తంభాలను అల్లుకుంటున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

ఐ.పోలవరం: విద్యుత్ సరఫరాకు చిన్నపాటి అవాంతరం వచ్చినా తట్టుకునే స్థాయిలో వినియోగదారులు లేరు. విద్యుత్ సరఫరా విషయంలో ఆ విభాగం అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో శివారు ప్రాంతాలు అధికం. ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో అయితే నదీపాయల మధ్య ఉన్న లంక గ్రామాలకు, మడ అడవుల మధ్య ఉన్న దీవులకు విద్యుత్ సరఫరా జరగాల్సి ఉంది. చిన్నచిన్న గాలులకు సైతం విద్యుత్ తీగలు తెగిపడడం, తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ఇక్కడ సర్వసాధారణం. ఇటువంటి పరిస్థితి ఉన్నప్పుడు విద్యుత్ అధికారులు సరఫరాలో ఎటువంటి అవాంతరాలు రాకుండా చూడాల్సి ఉంది. కానీ ఇక్కడ విద్యుత్ స్తంభాలు, తీగలు వాటికి అల్లుకుపోయిన పొదలు, స్తంభాల చుట్టూ పేరుకున్న చెత్త, పచ్చి మొక్కలు పరిశీలిస్తే అధికారుల నిర్లక్ష్యం ఏ పాటిదో అవగతమవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సైతం కనీస రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల ఆయా మండలాల్లో జంగిల్ క్లియరెన్స్, లైన్ల మరమ్మతుల పేరుతో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇంతా చేసి విద్యుత్ స్తంభాలున్న తీరు చూస్తుంటే, వీరు అసలేం బాగు చేశారో అనే సందేహాలను వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సరఫరాకు అవాంతరాలు లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేయడంతో పాటు, విద్యుత్ స్తంభాలపై పాకిన తీగ మొక్కలు తొలగించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కేశనకుర్రులో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అధికారులే బాధ్యత వహించాలి

గ్రామాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలకు డొంకలు, పొదులు అల్లుకుని ప్రమాదకరంగా పరిణమిస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఆరు నెలలకు ఓసారి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. ఆ సమయంలో స్తంభాలు చుట్టూ ఉన్న పొదులు, డొంకలను తొలగించ లేదు. గ్రామాల్లో తరుచూ విద్యుత్ సరాఫరాకు అంతయం ఏర్పడుతుంది. దీనివల్ల ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాలి

జి. నారాయణ,
వినియోగదారుడు, కేసనకుర్రు, ఐ. పోలవరం మండలం.

మత్స్యకార యువకుల ప్రతిభకు సత్కారం



జీడీ కానిస్టేబుల్‌గా ఎంపికైన ధర్మారావు



సీఆర్‌పీఎఫ్‌కు ఎంపికైన దుర్గాప్రసాద్

యానాం: స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)లో జీడీ కానిస్టేబుల్‌గా ఎంపికైన నియోజకవర్గ శివారు తీర ప్రాంత మత్స్యకార గ్రామస్తుడైన పోతాబత్తుల ధర్మారావును శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైనందుకు ఆయనను అభినందించారు. సీఆర్‌పీఎఫ్(టెక్నికల్ అండ్ ట్రేడ్స్‌మెన్) ఉద్యోగానికి ఎంపికైన అర్ధాని దుర్గాప్రసాద్‌ను సైతం ఆయన అభినందించారు. విద్యాభివృద్ధి ద్వారానే అన్ని రంగాల్లోనూ రాణించవచ్చునని సూచించారు. తీర గ్రామాల మత్స్యకారులు విద్యకు ప్రాధాన్యత నివ్వాలని ఆ దిశగా విద్యార్థులు, తల్లిదండ్రులు అవగాహన పొందాల్సిన ఆవశ్యకత గూర్చి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలి

యానాం: నియోజకవర్గ అభివృద్ధి కోసం గత కొంతకాలంగా రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ తన వంతు కృషి చేస్తోందని రీజెన్సీ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎన్ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 1985లో యానాం పారిశ్రామిక రంగ అభి వృద్ధి కోసం అప్పటి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కోన ప్రభాకరరావు, నాటి ముఖ్యమంత్రిగా ఉన్న ఎంఓహెచ్ ఫరూక్‌లు ఇరువురూ సహకారం అందించాలని దివంగత సీఎం ఎన్‌టి రామారావును కలవగా ఆయన అనుకూలంగా స్పందించారన్నారు. దీంతో రీజెన్సీ ప్రారంభ సమయంలో ఈక్విటీ షేర్ రూపంలో ఏపీఐడీసీ ద్వారా ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలో మైనార్టీలుగా ఉన్న యానాంలో తెలుగు ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ఎల్జీ కె కైలాష్‌నాథన్, సీఎం రంగసామిలు యానాం పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని దీనికోసం యానాంకు ఒక విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని కోరారు.

నేడు క్రిస్మస్ వేడుకలు

యానాం: ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఆదివారం సాయంత్రం న్యూ బస్టాండ్ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు శనివారం కాకినాడ జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు, తాళ్లరేవు వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుడు రెవరెండ్ దొమ్మేటి సామ్యూల్‌సాగర్ తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, గౌరవ అతిథిగా బిషప్ రెవరెండ్ దొమ్మేటి వసంత రావు, అంతర్జాతీయ ప్రసంగీకులు కర్మోజీ, పీవైఆర్ పీడబ్ల్యూఎస్ అధ్యక్షుడు డేవిడ్ హాజరు కానున్నారని తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

అమలాపురం టౌన్: స్థానిక శ్రావణి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.శ్రావణి, డాక్టర్ దీపక్ చక్రవర్తిల ఆర్థిక సహాయంతో శనివారం అమలాపురంలో వికలాంగులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కోనసీమ దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు వంటిద్దు వెంకన్న నాయుడు ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు నాగారపు పరశురాముడు ఆసుపత్రి ఉద్యోగులు చేతుల మీదుగా 15 మంది దివ్యాంగులకు రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసర వస్తువుల కిట్‌లను పంపిణీ చేశారు. శ్రావణి ఆసుపత్రి వైద్యులు శ్రావణి, దీపక్ చక్రవర్తిలు పేద ప్రజలకు కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఉద్యోగులు భవాని, వాణి కిషోర్, శ్రీను, కౌన్సిలర్ దొమ్మటి రాము, బొర్రా మాచరయ్య, తిరికోటి కనకరాజు, సాధనాల విఘ్నేశ్వరరావు, బొంతు శ్రీనువాస్, నెల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సభను జయప్రదం చేయాలి



ఉప్పలగుప్తంలో చలో గుంటూరు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉప్పలగుప్తం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న గుంటూరులో జరిగే మాలల సింహ గర్జనకు భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జిల్లా కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో దళిత నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ నెల 15న ఉదయం 11 గంటలకు రావులపాలెం మీదుగా ఈతకోట సెంటర్‌కు చేరుకొని అక్కడున్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసే కార్యక్రమం ఉంటుందన్నారు. అక్కడ నుంచి భారీ ఎత్తున గుంటూరు తరలి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, నాయకులు కొంకి వెంకట బాబ్జి, పాలమూరి మోహన్‌బాబు, రేవు తిరుపతి రావు, గెడ్డం సురేష్‌బాబు, యాళ్ల లక్ష్మీనారాయణ, జంగా శ్రీనివాసరావు, కొంకి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం పోరుబాట



ఓఎన్‌జీసీ గేటు ముందు ధర్నా చేస్తున్న ఓడలరేవు గ్రామస్తులు

అల్లవరం: ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్‌లో నిర్వహణ విభాగంలో పనులు చేస్తున్న ప్రోమోటెక్ కంపెనీ స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు అవకాశాలు ఇస్తున్న తీరుపై టెర్మినల్ గేటు ముందు శనివారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ప్రోమోటెక్ కంపెనీలో బయట ప్రాంతాలకు చెందిన 30 మందికి ఉద్యోగాలు కల్పించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన టెక్నికల్ అభ్యర్థులకు 70 శాతం ఉద్యోగాలు ఇస్తామని ప్రోమోటెక్ కంపెనీ ఒప్పందం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని స్థానికులు ఆరోపించారు. ఒప్పందం ప్రకారం 70 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఓఎన్‌జీసీ ఈడీ నికిలేష్ స్పందించి ప్రోమోటెక్ కంపెనీతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన కారులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో తాచుపాము కలకలం

కాట్రేనికోన: కాట్రేనికోన మెయిన్ రోడ్డులో ఉన్న కార్తికేయ ఆసుపత్రిలో శనివారం తాచుపాము హల్‌చల్ చేసింది. ఆసుపత్రి కిటికీపై ఉన్న వలలో చిక్కుకున్న త్రాచు పామును గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది, రోగులు బెంబేలెత్తిపోయారు. స్థానికులు ఉప్పలగుప్తం మండలం భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న స్నేక్ కేచర్ గణేష్‌వర్మ త్రాచుపామును పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పామును అటవీ ప్రాంతంలో వదిలి పెడతానని వర్మ తెలిపారు.

కాట్రేనికోన కార్తికేయ ఆసుపత్రిలో పామును పట్టుకున్న గణేష్ వర్మ →



కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

యానాం: పుదుచ్చేరి సహకార శాఖలో ఖాళీగా ఉన్న కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం భర్తీకి ఆదివారం యానాంలో నిర్వహించే రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. శనివారం స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వ హైస్కూల్‌లో ఇన్విజిలేటర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను తప్పకుండా పాటించాలని కోరారు. పరీక్షా కేంద్రంలో ప్రతి గదిలోనూ సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్ ద్వారానే అభ్యర్థులను గదుల్లోకి అనుమతిస్తామన్నారు. యానాంలో మొత్తం 313 మంది అభ్యర్థులు రాతపరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. వీరికోసం మొత్తం 15 గదులను సిద్ధం చేసినట్లు తెలిపారు. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ అండర్ సెక్రటరీ మురుగేషన్, డీపీఆర్ వింగ్ ఆఫీసర్ శంకరలింగం తదితరులు పాల్గొన్నారు.



ఇన్విజిలేటర్లకు శిక్షణనిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు



దేవగుప్తంలో నీటి సంఘం నూతన పాలకవర్గం



ముమ్మిడివరంలో ఏకగ్రీవంగా ఎన్నికైన నీటి సంఘం పాలక వర్గసభ్యులు



వన్నె చింతలపూడి ఉన్నత పాఠశాలలో ఎన్నికలను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి



నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

అల్లవరం: మండలంలోని ఐదు సాగు నీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దేవగుప్తం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా మేడిద వీర వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కోలా తాతరాజు ఎన్నికైయ్యారు. తాడికోన నీటి సంఘం అధ్యక్షుడిగా సాధనాల నాగ వెంకట సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా అబ్బిరెడ్డి రంగబాబు, గోడిలంక అధ్యక్షుడిగా బొక్కా శివనాగ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బండిగుప్తాపు వీర వెంకట సత్యనారాయణ, కొమరగిరిపట్నం అధ్యక్షుడిగా దాట్ల వెంకట రాజగోపాలరాజు, ఉపాధ్యక్షుడిగా యర్రంశెట్టి నాగేశ్వరరావు, బెండమూర్లంక అధ్యక్షుడిగా గుర్రం శ్రీహరి రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కడలి అచ్యుతరామారావు ఎన్నికైనట్లు తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు తెలిపారు. మండలంలో ఎక్కడా పోటీ లేకుండానే ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిందన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం మండలం రెడ్డిపల్లి నీటి సంఘం అధ్యక్షుడిగా బండారు సత్యసాయి ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వన్నె చింతలపూడి ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నికల అధికారి, తహసీల్దార్ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి ఉపాధ్యక్షుడిగా యాళ్లశ్రీ వెంకట లక్ష్మీనారాయణతో పాటు మరో పది మంది డైరెక్టర్లను రైతులు ఎన్నుకున్నారు. వీరందరికీ తహసీల్దార్ కిషోర్ బాబు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎన్నికలను జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి పరిశీలించారు. నూతన కార్యవర్గాన్ని అధికారులు, రైతులు అభినందించారు.

కాట్రేనికోన: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కాట్రేనికోన మండల పరిధిలోని ఆరు నీటి సంఘాలకు అధ్యక్షులుగా పల్లంకుర్రు నుంచి ఇసుకపట్ల వెంకటరమణ , కందికుప్ప నుంచి ఆకాశం శ్రీనివాస్, గెద్దనపల్లి నుంచి పిన్నమరాజు రంగరాజు, కాట్రేనికోన నుంచి వాసంశెట్టి రాజేశ్వరరావు, గాడవిల్లి నుంచి బందారు జగపతి రాజారావు, చెయ్యేరు నుంచి యనమదల బాలాజీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నీటి సంఘాల అధ్యక్షులతో పాటు టీసీలు ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది.

ఐ.పోలవరం: పోలవరం మండల పరిధిలో గుత్తెన దీవి, కేశనకుర్రు, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి గ్రామాల్లో నీటి సంఘ ఎన్నికలు జరిగాయి. గుత్తెనదీవి సాగు నీటి వినియోగ దారుల సంఘం అధ్యక్షుడిగా సాగి వెంకటపతిరాజు, ఉపాధ్యక్షుడిగా గోదాసు శ్రీనివారావు ఎన్నికయ్యారు. అలాగే కేశనకుర్రు గ్రామ అధ్యక్షుడిగా చిలువూరి సుబ్బరాజు, ఉపాధ్యక్షుడిగా సత్తి శ్రీనివాసరావు, ఐ.పోలవరం అధ్యక్షుడిగా రాయపురెడ్డి స్వామి నాయుడు, వైస్ ప్రెసిడెంట్‌గా మట్టపర్తి చంద్రరావు, టి. కొత్తపల్లి సంఘ అధ్యక్షుడిగా చోడిశెట్టి నాగబాబు, ఉపాధ్యక్షులుగా అరవ వీరవెంకట స్వామి నాయుడు ఎన్నికయ్యారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఎనిమిది నీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ప్రతి గ్రామంలోనూ అధ్యక్ష పదవులకు టీడీపీ శ్రేణులు ఎగబడి తమ హవా చాటుకున్నారు. బీజేపీ, జనసేన నాయకులకు ఈ పదవుల్లో కొన్ని చోట్ల ప్రాధాన్యత తగ్గటంతో ఆ పార్టీ కేడర్‌లో అసంతృప్తి భావాలు బయటపడ్డాయి. టీడీపీ నాయకులు ప్రతి చోట ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారు. మండలంలోని చినగాడవిల్లి సంఘానికి బందారు జగపతి రాజారావు, గొల్లవిల్లికి నల్లా సత్యానారాయణ మూర్తి, గోపవరానికి ఆకుల వెంకటరమణ, కిత్తనచెరువుకి బందారు వెంకటేశ్వరరావు, ఎస్.కొత్తపల్లికి గుత్తుల శ్రీనివాస్, ఎస్.యానంకు పోలిశెట్టి వెంకట ఉమా మహేశ్వరరావు, చల్లపల్లికి దంగేటి వీరవెంకట రెడ్డినాయుడు, ఉప్పలగుప్తానికి మోటూరి రవిశంకర్ కుమార్‌లు ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. ఎన్నిక నిర్వహణను తహసీల్దార్ దివాకర్ పరిశీలించారు. నియామితులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల పరిధిలో ముమ్మిడివరం, అనాతవరం సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులుగా సరిపెల్ల శ్రీనివాసరాజు, శీలం వెంకటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీఓ టి.వెంకటాచార్య పర్యవేక్షణలో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో ముమ్మిడివరం సాగు నీటి వినియోగదారుల సంఘంలో 12 మంది సభ్యులకు గాను ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ఆయా సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సరిపెల్ల శ్రీనివాసరాజు, బొబ్బిలి ఈశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనాతవరం నీటి సంఘంలో 12 మంది సభ్యులకు గాను 12 నామినేషన్‌లు దాఖలు కావడంతో 12 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శీలం వెంకటేశ్వరరావు, నగుబత్తుల పద్మనాభంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన పాలక వర్గ సభ్యులను పలువురు అభినందించారు.

తాళ్లరేవు: నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని ఏడు సంఘాలకు ఏకగ్రీవంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఉదయం 8 గంటలకే ఆయా పంచాయతీలలో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో గల 12 టీసీ మెంబర్లను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేశారు. ఏడు సంఘాలకు గానూ నీలపల్లి నీటి సంఘాన్ని జనసేనకు కేటాయించారు. పోలేకుర్రు నీటి సంఘం అధ్యక్షుడిగా అల్లూరి రామకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడిగా సూరారపు దుర్గాభవాని, పటవల నుంచి కొత్తూరు కాశీ ఈశ్వరుడు, గండి వెంకటేష్, నీలపల్లి నుంచి ధూళిపూడి గోవిందరావు(గోపి), కాలా సత్యనారాయణ, కోరంగి నుంచి ఏవీబీఎస్ బాబారాజు, ఏరుపల్లి నుంచి వీరన్న, పి.మల్లవరం నుంచి మొగలితుర్తి శ్రీనివాసరావు, యడ్ల సుబ్బారావు, ఇంజరం నుంచి వేగేశ్న భాస్కరరాజు, మేడిశెట్టి కుమారస్వామి, లచ్చిపాలెం నుంచి దాసరి వెంకటరెడ్డి, కాశ్ల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఏకగ్రీవంగా ఎంపికైన నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, కూటమి నాయకులు అభినందించారు.